నమస్తే తెలంగాణ
కరీంనగర్
8 | కరీంనగర్, సోమవారం 2 జూన్ 2025 | KARIMNAGAR

## టెన్త్ పాస్ విద్యార్థులకు సువర్ణావకాశం




కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీ, జూన్ 1: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుపేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు పైచదువుల కోసం కపిల్ విద్య వారధి పేరుతో ఆర్థికసాయం చేసేందుకు సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ నిర్ణయం తీసుకున్నదని ట్రస్టు ఉపాధ్యక్షుడు అప్పిడి రాజిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు, తల్లి, తండ్రి లేని విద్యార్థులు, 470 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 8న నిర్వహించనున్న అర్హత పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన పది మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారు ఏ కోర్సు చేసినా, వారికి నచ్చిన ఏ వృత్తిలోనైనా స్థిరపడే వరకు సంస్థ ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు WWW.KAPIL VIDYA VARADHI.ORG వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



## ఐదు వందలుండే చోట పన్నెండు వందల కోడెలా..?

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు


- అనారోగ్యంతో చనిపోతున్నా విప్ ఎందుకు మాట్లాడరు?
- కోడెల మృతికి కారకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- ఆదాయం మీదనే ప్రభుత్వానికి, అధికారులకు శ్రద్ధ
- మూగజీవాల ప్రాణాలు పోతున్నా కనీస మానవత్వం లేదు
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, జూన్ 1: ఐదు వందల కోడెలు ఉండే స్థలంలో పన్నెండు వందల కోడెలు ఎలా ఉంటాయని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. ఆహారం అందక, అనారోగ్యంతో చనిపోతున్నా స్థానిక ఎమ్మెల్యే, విప్ ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. రాజన్న ఆలయ గోశాల నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం వహించడంతోనే కోడెలు పిట్టల్లా రాలిపోయాయని ఆవేదన చెందారు. అందుకు కారణమైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేములవాడలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడ చీమ చిటుక్కుమన్నా మాట్లాడే ఆది శ్రీనివాస్ కోడెలు మృత్యువాత పడుతున్నా ఎందుకు స్పందించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకునే ఆనవాయితీలో భాగంగా ప్రతినిత్యం స్వామివారికి కోడెలు సమర్పిస్తున్నారని, మరో వైపు గుడి బంద్ చేస్తారన్న ప్రచారంలో భాగంగా భక్తులు వేలాదిగా తరలివస్తూ స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన నిజ కోడెను సమర్పించుకుంటున్నారని తెలిపారు. ఆరు నెలల కిందట మంత్రి కొండా సురేఖ ఇచ్చిన సిఫారసు లేఖతో ఒకరికి 60 కోడెలు కేటాయించడం వివాదాస్పదంగా మారి ఈ పంపిణీ ఆగిపోయిన విషయం తెలిసిందేనని, దీంతో కేవలం 500 కోడెలను ఉంచే తిప్పాపూర్ గోశాలలో 1200కు పైగా ఉంచారని తెలిపారు. ఈ కారణంగా కోడెలు అనారోగ్యం బారిన పడి సరైన ఆహారం అందక మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సాక్షాత్తూ పశు వైద్యాధికారులే నిర్ధారించడం దురదృష్టకరమన్నారు. గడిచిన మూడు రోజుల్లో తిప్పాపూర్ గోశాలలో 18 కోడెలు మృతి చెందాయన్నారు. స్వామివారికి కోడె మొక్కు ద్వారా ఏడాదికి దాదాపు ₹22 కోట్ల ఆదాయం వస్తున్నా కనీసం ఆహారం పెట్టలేని దుస్థితిలో రాజన్న ఆలయ అధికారులు, ఈ ప్రభుత్వం ఉండడం దురదృష్టకరమని ధ్వజమెత్తారు. ఆహారం లేక మృతి చెందితే అధికారులు, నాయకులకు కనీస మానవత్వం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు రాజన్న కోడెలకు ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారు? ఏమైనా వైద్య సదుపాయాలు కల్పించి మందులు కొనుగోలు చేశారా? ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. చనిపోయిన తర్వాత మాత్రమే అధికారులు హడావిడి చేస్తూ పంపిణీకి సిద్ధమవుతున్నట్టు కలెక్టర్ ప్రకటన చేశారని మండిపడ్డారు. గతంలో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా పకడ్బందీగా పంపిణీ జరగాలని సూచించారు. ఇకపై రాజన్న కోడెలకు శాశ్వత పరిష్కారంగా 50 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి వాటిని కాపాడి భక్తుల మనోభావాలను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే భక్తుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజస్థాన్ ప్రాంతంలో రెండు వేల ఎకరాల్లో లక్షా 50వేల గోవులను సంరక్షిస్తున్నారని, అలాంటి ప్రదేశాలకు వెళ్లి అధ్యయనం చేసి కోడెలను కాపాడాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, క్రాంతి కుమార్, రామతీర్థపు రాజు, నరాల శేఖర్, సిరిగి రామచందర్, నిమ్మ శెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, గోలి మహేశ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఈర్లపల్లి రాజు, ముద్ర కోల వెంకటేశం, నరాల దేవేందర్, నీలం శేఖర్, హింగె కుమార్, మల్లేశం, రాజు, పోతు అనిల్, సందీప్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కుమ్ములాటలు.. ఇందిరమ్మ కమిటీలకు శాపం!

## కరీంనగర్, జగిత్యాల నియోజకవర్గాల్లో నేటికీ ఏర్పడని కమిటీలు

- గడువు దాటి నాలుగు నెలలవుతున్నా పట్టింపులేని సర్కారు
- పెండింగ్‌లోనే అర్హుల ఎంపిక
- స్వప్రయోజనాల కోసం నాయకుల పాకులాట
- నిర్ణయం తీసుకునేందుకు ఇన్‌చార్జి మంత్రి వెనుకా ముందు!
- పేద, మధ్యతరగతి వర్గాల్లో నిరాశ



**కాంగ్రెస్‌లో కుమ్ములాటలు.. ఆధిపత్య పోరు ఇందిరమ్మ ఇండ్లకు అడ్డంకిగా మారుతున్నాయి. దీనికి నిదర్శనం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలే! నిబంధనల ప్రకారం ఇందిరమ్మ కమిటీలు వేయాల్సిన గడువు దాటి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఈ రెండు సెగ్మెంట్లలో నేటికీ అతీగతీ లేదు. కమిటీలు ఏర్పాటు కాకపోవడంతో వార్డులు, పంచాయతీల వారీగా అర్హుల జాబితాకు ఆమోద ముద్రపడ లేదు. ఈ విషయంలో జోక్యం చేసుకొని పేదలకు న్యాయం చేయాల్సిన ఇన్‌చార్జి మంత్రి, ఆయా నియోజకవర్గాల్లో జరుగుతున్న ఆధిపత్య పోరులో వేలు పెట్టేందుకు జంకుతున్నట్టు తెలుస్తున్నది. అందుకే కమిటీల జాబితా ఏర్పాటు పెండింగ్‌లో పెడుతున్నట్టు తెలుస్తుండగా, ఈ కారణం వేలాది మంది అర్హులకు శాపంలా మారింది. పేదల సొంతింటి కలకు బ్రేక్ పడుతుండగా, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు నిరాశే మిగులుతున్నది.**

కరీంనగర్, జూన్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభానికి ముందు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు 2024 అక్టోబర్ 11న జీవో ఎంఎస్ 33ను జారీ చేసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్ల నిర్మాణానికి ₹5 లక్షల ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించింది. గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తాయని స్పష్టం చేసింది. గ్రామ స్థాయిలో సర్పంచ్/ స్పెషల్ ఆఫీసర్ ఇందిరమ్మ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఉంటారని, గ్రామ కార్యదర్శి కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపింది. మున్సిపాలిటీల్లో వార్డు కౌన్సిలర్లు/ వార్డు అధికారులు ఉంటారని పేర్కొన్నది. ఇక గ్రామం నుంచి ముగ్గురు సభ్యులను ఎంపిక చేయాలని, అందులో జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కమిటీలో కచ్చితంగా 50 శాతం మహిళలు ఉండాలని సర్కారు నిబంధన పెట్టింది. జనవరి 21 నుంచి 24 తేదీల మధ్య గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గంలో 3,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెప్పింది. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ కమిటీలు జనవరిలోనే ఏర్పాటు కావాలి. కానీ, గడువు దాటి నాలుగు నెలలవుతున్నా నేటికీ కరీంనగర్, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాలేదు.

### ఆధిపత్య పోరు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న విషయం తెలిసిందే. కానీ, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కరీంనగర్ అసెంబ్లీ నియోజవర్గాల్లో మాత్రం అర్హులకు ఆ యోగం పట్టడం లేదు. గ్రామ, జిల్లా స్థాయిల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి ఆ కమిటీల పర్యవేక్షణలో లబ్ధిదారులను గ్రామ సభల్లో గుర్తించి.. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే.. వాటికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. అప్పుడే అర్హుల తుది జాబితా ఖరారు అయినట్టు పరిగణించి, సదరు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తారు. కానీ, ఈ రెండు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ వర్గీయుల్లో నెలకొన్న ఆధిపత్య, వర్గ పోరు, వారివారి స్వప్రయోజనాల వల్ల ఇంకా ఇందిరమ్మ కమిటీలకే ఆమోద ముద్ర పడలేదు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా కేంద్రం కావడంతో.. ఇక్కడ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తమ ఆధిపత్యం చాటుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారే చాప కింద నీరులా.. తమ వర్గాలను విస్తరిస్తున్నారు. దీంతో ఇప్పటికే కాంగ్రెస్ శ్రేణులు రెండు వర్గాలుగా చీలిపోయాయి. అందులో భాగంగానే ఇందిరమ్మ కమిటీల్లో ఎవరికి వారే తమ వారికి చోటు కల్పించేందుకు వేరువేరు జాబితాలు తయారు చేసి.. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపడంతో ఆయన వాటికి ఆమోద ముద్రవేయకుండా పెడింగ్‌లో పెట్టారని తెలుస్తున్నది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు పేర్ల జాబితా తయారు చేసి ప్రతిపాదనలు పంపి వాటికే ఆమోద ముద్రవేయాలని పట్టుపడుతున్నారు. ఇదే సమయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి.. మరో జాబితా రూపొందించి పంపారు. వీరితో అంతగా సఖ్యత లేని మంత్రి పొన్నం వర్గీయులు.. వారు కూడా మరో జాబితా తయారుచేసి ఇన్‌చార్జి మంత్రికి పంపినట్టు తెలుస్తున్నది. ఇక్కడితో ఆగకుండా ఎవరికి వారే.. తమ జాబితాకు ఆమోద ముద్ర వేయాలంటూ.. ఇన్‌చార్జి మంత్రిపై ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తున్నది. దీంతో ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పెడింగ్‌లో పెట్టారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నిజానికి కరీంనగర్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకులు చెప్పిన పేర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

### జగిత్యాల నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి

జగిత్యాల నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ఇక్కడ అంటే, గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించి, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఆ పార్టీలో సీనియర్ నాయకుడు, జగిత్యాల కాంగ్రెస్ ఇన్‌చార్జి జీవన్‌రెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. వీరిద్దరి మధ్య పరస్పర విమర్శలు బాహాటంగానే సాగుతున్నాయి. ఒక వర్గం.. మరో వర్గాన్ని టార్గెట్ చేసి విమర్శలు చేస్తున్నది. రెండు వర్గాల మధ్య ఇందిరమ్మ కమిటీ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. దీంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లోనూ రెండేసి జాబితాలు తయారై ఇన్‌చార్జి మంత్రికి అందినట్లుగా తెలుస్తున్నది. ఇరువురు పట్టు విడుపులు లేకుండా.. వారి వారి ప్రతిపాదనలను ఆమోదించాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఇందిరమ్మ కమిటీలు ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో అర్హులకు అన్యాయమే జరుగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి ఈ రెండు నియోజకవర్గాల్లో ఉన్న సమస్యను ఇన్‌చార్జి మంత్రి గుర్తించి తక్షణం ఏదో ఒక నిర్ణయం తీసుకొని, అన్ని నియోజకవర్గాల మాదిరిగానే ఇక్కడ కూడా ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తున్న నేపథ్యంలో ఇన్‌చార్జి మంత్రి ఎలా స్పందిస్తారో చూడాలి. కాగా, పార్టీ నాయకుల మధ్య వివాదం ప్రభావం.. ఇందిరమ్మ ఇండ్లపై పడుతుడడం కాంగ్రెస్‌లోని చాలా మంది నేతలకు సంకటంగా మారుతున్నది. ఈ రెండు నియోజకవర్గాల్లో నాయకుల మధ్య ఏర్పడిన పోరు వల్ల దాదాపు ఏడు వేల పైచిలుకు ఇండ్లు మంజూరుకు నోచుకోకుండా పోతున్నాయన్న ఆవేదన సదరు నాయకుల్లో వ్యక్తమవుతున్నది. ఈ విషయాన్ని ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తున్నది.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

## కేసీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

- సంజయ్ ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదు
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఫైర్
- చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని హితవు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 1 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కేవలం కేసీఆర్‌ను విమర్శించడం తప్ప మరొకటి తెల్వదని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఘాటుగా విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఇష్టం వచ్చినట్టు విమర్శిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అనవసర విమర్శలు మానుకోవాలని, చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని సూచించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంజయ్ ఎంతసేపు బీఆర్ఎస్‌ను కుటుంబ పార్టీ అని మాట్లాడుతున్నాడని, అసలు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకు కూడా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్డీఏలో 23 పార్టీలు ఉన్నాయని, అందులో కుటుంబ పార్టీలు లేవా..? అని ప్రశ్నించారు. పక్కనే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న టీడీపీ కుటుంబ పార్టీ కాదా..? అని, అది ఆయనకు కనిపించడం లేదా ఆగ్రహించారు. ఇంకా జనసేన, ఎల్‌జీపీ, జేడీఎస్ ఇలా అన్ని పార్టీలు కూడా కుటుంబ పార్టీలేనని గుర్తు చేశారు. కేంద్రమంత్రి స్థాయిలో ఉన్న సంజయ్ సోది మాటలు బంద్ చేయాలని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఇన్ని కుటుంబ పార్టీలతో పొత్తు పెట్టుకొని బీఆర్ఎస్‌పై విమర్శలు చేసే అర్హతే లేదని తేల్చి చెప్పారు. టీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ పార్టీ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మిగిలిన కుటుంబ పార్టీల్లో ఉన్నట్టుగా కేటీఆర్, కవిత, హరీశ్‌రావు రాజకీయాల్లోకి రాలేదని, పార్టీ పెట్టినప్పుడు పునాదుల్లా పని చేశారని, నిత్యం పార్టీలో.. ప్రజలతో భాగస్వామ్యం అయ్యారని గుర్తు చేశారు. కేసీఆర్, కవితపై పెట్టిన కేసులు కక్షసాధింపు కేసులేనని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు ఏ కేసులోనైనా కేసీఆర్‌పై ఎఫ్ఐఆర్ బుక్ అయిందా..? అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్నది బీజేపీనే కదా.. మరి ఎందుకు కేసులు పెట్టి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కవితపై పెట్టిన కేసు బ్లాక్‌మెయిల్ కేసు మాత్రమేనని చెప్పారు. అసలైన క్రిమినల్ సంజయ్ అని విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకుపోతుంటే ఆయన మాత్రం రాష్ట్రాన్ని నాశనం చేయడానికి కొట్లాడుతున్నాడని విమర్శించారు. అక్రమ దందాలు, అవినీతి ఆరోపణలు ఉన్న 23 మంది నాయకులను బీజేపీలోకి తీసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోడీని తిడుతుంటే వారం రోజులుగా ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సంజయ్ మనసులో మోడీ దెయ్యమని అనుకుంటున్నాడని, అందుకే స్పందించడం లేదేమోనని తాము భావిస్తున్నామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదాయం లేదని చెప్పుతున్నారని, కేంద్ర మంత్రిగా బండి కూడా అదే అంటున్నారని, మరి ఎందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, దూలం సంపత్, ఆరె రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన రోత రోత



ఇంటి ముందుకు వచ్చే చెత్త తరలించే వాహనాలకే చెత్తను అందించాలని ఏళ్ల తరబడిగా అధికారులు మొత్తుకుంటున్నా కొందరు మారడం లేదు. ఖాళీ ప్రదేశాలు.. రోడ్డు పక్కన.. ఇలా ఎక్కడ పడితే అక్కడ ఎవరూ చూడక ముందు చెత్త పడేస్తూ రోత రోత చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ చెత్తంతా రోడ్లపైకి చేరి ప్రయాణికులకు నిత్యం నరకం చూపిస్తున్నది. అందుకు నిదర్శనమే ఇక్కడ కనిపిస్తున్న చిత్రం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో గల ఫుట్‌పాత్‌పై ఇష్టారాజ్యంగా చెత్త పడేయడంతో వర్షాలకు ఇలా రోడ్డుపైకి విస్తరించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్



## 'యాస్వాడ' ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో యాస్వాడ గ్రామస్తులు

విద్యానగర్, జూన్ 1: మనం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు, ఉద్యోగుల సమ్మేళనాలు, కులబాంధవుల ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకోవడం చూస్తుంటాం! ఎప్పుడో 45 ఏళ్ల క్రితం లోయర్ మానేర్ డ్యాంలో ముంపునకు గురైన యాస్వాడ గ్రామస్తులందరూ ఇప్పుడు ఒకే వేదికపైకి వచ్చి ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. కుల, మత, ప్రాంతీయ వర్గ భేదం లేకుండా అందరూ కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ప్రత్యేకతను చాటుకున్నది. 1980 ఆగస్టులో నిర్మాణమైన లోయర్ మానేర్ డ్యాంతో ఎన్నో గ్రామాలు చెల్లా చెదురయ్యాయి. వందల సంఖ్యలో కుటుంబాలు తలోదిక్కున పోయాయి. ఇలానే యాస్వాడ గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్లి నివాసాలు ఏర్పరచుకున్నారు. కానీ, తమతో కలిసి ఉన్న అప్పటి వాళ్లందరిని కలువాలని యాస్వాడ గ్రామస్తులు మధుసూదన్ రెడ్డి తపించారు. అనుకున్నదే తడవుగా అందరినీ కలిసి ఒకే వేదికపైకి తెచ్చారు. ఆదివారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని కొత్త యాస్వాడలోని సప్తగిరి ఫంక్షన్‌లో 300 మంది కలిశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తన అనుభవాలను ఇప్పటి తరానికి వివరించారు. నాటి గ్రామంలో ఉన్న పురాతన శివలయాన్ని పునర్ నిర్మించాలని అందరు కలిసి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ ఈశ్వర్ గౌడ్, అబ్బిడి భాస్కర్‌రెడ్డి, అట్టేపల్లి నర్సయ్య, ర్యాకం సుధాకర్, సంజీవ్‌కుమార్, బొద్దుల సత్తయ్య, అట్టేపల్లి శ్రీధర్, పోలాడి మాధవరావు, రమణారావు, కామ శ్రీనివాస్, పంజాల భాస్కర్, దయాసాగర్ రావు, గణపతి, శ్రీరామ్ రెడ్డి, కమిటీ రాములు, కటకం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, కుల్ల జయేందర్, పోచయ్య, ఎల్లయ్య, తీగల మునిందర్, వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.







## లోకల్ కళాకారులకు మొండి చెయ్యి



ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కళాకారులు

- తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సిద్ధం కావాలని చెప్పి సమయానికి నిరాకరించిన సింగరేణి
- హైదరాబాద్ కళాకారులతో కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానిక కళాకారులు

పెద్దపల్లి, జూన్ 1( నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆవిర్భావ వేడుకల నిర్వహణలో స్థానిక కళాకారులకు సింగరేణి యాజమాన్యం మొండి చెయ్యి చూపించింది. పెద్దపల్లి జిల్లా సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ వేడుకలకు సిద్ధం కావాలని 15 రోజుల క్రితమే స్థానిక కళాకారులకు సింగరేణి అధికారులు తెలిపారు. ఎప్పటి మాదిరిగానే స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గత 15 రోజులుగా వేడుకల్లో కార్యక్రమాల నిర్వహణ, సాంస్కృతిక ప్రదర్శనల కోసం దాదాపుగా 200ల మంది కళాకారులు 15 మంది మాస్టర్ల సారథ్యంలో తర్ఫీదు పొందారు. సాంస్కృతిక ప్రదర్శనలన్నీ హైదరాబాద్ నుంచి వచ్చే కళాకారులే చేస్తారని ''మీకు కార్యక్రమాలు ప్రదర్శించే అవకాశం లేదు'' అని చెప్పడంతో స్థానిక మాస్టర్లు, కళాకారులు అవాక్కయ్యారు. ప్రోగ్రామ్స్‌కు సిద్ధం కావాలని చెప్పి, సమయానికి నిరాకరించడంతో వారు ఆందోళనకు గురయ్యారు. ప్రతీ సంవత్సరం గోదావరిఖనిలో నిర్వహించే దసరా, సింగరేణి ఉత్సవాలు, తెలంగాణ అవతరణ వేడుకలతో ఉపాధి పొందే తమకు సింగరేణి అధికారులు అన్యాయం చేశారని వాపోతున్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు 15 రోజులుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల శిక్షణతోపాటు కాస్ట్యూమ్స్‌కు సైతం పెద్ద ఎత్తున ఖర్చు చేశామని, తీరా సమయానికి సింగరేణి అధికారులు తమకు కార్యక్రమం ఇవ్వకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ఆర్జీ-1 నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో కలిసినా ఎలాంటి ఫలితం లేక పోవడంతో మీడియాతో గోడు వెల్లబోసుకున్నారు. సింగరేణి కార్మికుల పిల్లలను కాదని వేరే వారికి అవకాశం ఇవ్వడమేంటని ప్రశ్నించారు.

### ఇదేంటని అడిగితే దురుసుగా మాట్లాడుతున్నరు

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని వారం రోజుల కిందట మాకు చెప్పారు. దీని కోసం మేం పిల్లలను అన్ని విధాలుగా తయారు చేశాం. ఈ క్రమంలో సింగరేణి అధికారులు మాకు ఫోన్ చేసి ప్రోగ్రాం ఇవ్వడం లేదు, హైదరాబాద్ జబర్దస్త్ టీంకు అప్పగిస్తున్నామని చెప్పారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తిరుపతి మాకు ప్రోగ్రాం ఉందని చెప్పి మళ్లీ ఇలా చేశారు. ఇదే విషయమై జీఎం కార్యాలయానికి వెళ్లి హనుమంతురావు సార్‌ను అడిగితే మాతో చాలా దురుసుగా మాట్లాడారు. మీకు ఎవరు చెప్పారో వాళ్లనే అడగండని, ప్రోగ్రాం మాకు ఇవ్వడం లేదని చెప్పారు. మేం జీఎంను కలుస్తామన్నా సార్ లేరు వెళ్లిపోండి అంటూ బయటికి పంపించారు.

-విజయ్, డ్యాన్స్‌మాస్టర్

### 18 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం

సింగరేణి సాంస్కృతిక కార్యక్రమాలను మేం 18 ఏళ్లుగా స్థానిక కళాకారులతో కలిసి నిర్వహిస్తున్నాం. ఈసారి మాత్రం హైదరాబాద్‌లోని జబర్దస్త్ టీంకు అప్పగించినట్లు చెప్తున్నారు. మొదట మమ్మల్ని సిద్ధం కావాలని చెప్పి చివరికి మొండిచెయ్యి చూపడం సరికాదు. ఇప్పటికే పిల్లలంతా వారు చేసే ప్రోగ్రామ్స్ సంబంధించిన డ్రెస్, కాస్ట్యూమ్స్ సిద్ధం చేసుకున్నారు. సింగరేణి సంస్థ 200 మంది పిల్లలు, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడంతో పాటు కళాకారులను అవమాన పరిచింది.

-పులిపాక దేవేందర్, కళాకారుడు